

నేటి నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

మేడ్చల్ జూన్ 2(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరుగనున్నట్లు మేడ్చల్ జిల్లా విద్యా శాఖ అధికారి విజయలక్ష్మి ఆదివారంప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 5106 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, 23 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. 23 మంది చీఫ్ సూపరిండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్, నాలుగు బృందాల ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



వికారాబాద్ కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఎగురువేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అట్టహాసంగా..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలు ఆదివారం వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో అట్టహాసంగా నిర్వహించారు పట్టణ, మండల కేంద్రాలతో పాటు గ్రామగ్రామాన ప్రభుత్వ, పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. అనంతరం అమరవీరుల స్థూపం, చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఆయా జిల్లాల కలెక్టరేట్లలో కలెక్టర్లు నారాయణరెడ్డి, గౌతమ్‌లు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. అదనపు కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

- వికారాబాద్, మేడ్చల్ కలెక్టరేట్లలో జాతీయ జెండాలను ఎగురవేసిన కలెక్టర్లు నారాయణరెడ్డి, గౌతమ్
- అమరవీరుల స్థూపాల వద్ద నివాళులు
- పోలీసుల గౌరవ వందనం స్వీకరణ.. అమరుల కుటుంబాలకు సన్మానాలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మేడ్చల్ కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఎగురవేస్తున్న కలెక్టర్ గౌతమ్



వికారాబాద్ : వేడుకల్లో విద్యార్థుల నృత్యాలు



అమరుల త్యాగాలు మరువలేనివి

- వారి ఆశయాలు, ఆకాంక్షల మేరకు ముందుకు సాగాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర సాధనలో అమర వీరుల త్యాగాలు మరువలేనివని, స్వరాష్ట్ర పోరాటంలో అమరుల త్యాగాల వల్ల ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నామని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ముందుగా పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ దగ్గర ఉన్న అమరవీరుల స్థూపానికి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి, ఎస్పీ కోటిరెడ్డిలతో కలిసి పూలమాలల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి జాతీయ పతాకావిష్కరణ గావించిన అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వరాష్ట్ర పోరాటంలో అమరవీరుల త్యాగాలు మరువలేవని, ఉద్యమల్లో పాల్గొన్న వారందరికీ అభినందనలు తెలుపుతూ, ప్రాణత్యాగం చేసిన అమరులను స్మరిస్తూ నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 వసంతాలు పూర్తి చేసుకొని 11వ వసంతంలోకి అడుగిడుతూ ఉత్సాహ పూరిత వాతావరణంలో వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారి ఆశయాలు, ఆకాంక్షల మేరకు రాష్ట్రాన్ని, జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించుటలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు
ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో , సజావుగా నిర్వహించుటలో అధిక సంఖ్యలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకొనుటలో జిల్లా యంత్రాంగానికి సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, అన్ని స్థాయిల ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తాండూరు బాలికల ఉన్నత పాఠశాల, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాల మోమిన్‌పేట, సరస్వతీ నృత్య కళాశాల వికారాబాద్, బాల కేంద్రం విద్యార్థుల సాంస్కృతిక సారధి బృందం కళాకారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, జిల్లా అధికారులు పాల్వాన్ కుమార్, గోపాల్, రేణుకాదేవి, మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

తెలంగాణను అగ్రగామిగా నిలపాలి

- మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ జూన్ 2(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సంబురాలు ఆదివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ గౌతమ్ జాతీయ జెండా ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లాకు సంబంధించి సంక్షిప్త సందేశాన్ని కలెక్టర్ చదివి వినిపించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పది నిముషాల్లో కార్యక్రమాన్ని ముగించారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అగ్రగామిగా నిలుపడానికి అందరూ కృషి చేయాలని కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. కీసరలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించిన అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ పతాకావిష్కరణ గావించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తయి 11వ వసంతంలోకి అడుగిడుతున్న వేళ జిల్లా ప్రజలందరికి రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో మంది త్యాగధనుల కృషి ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు ముందుకురావాలన్నారు. జిల్లాలోని అన్ని సామాజిక వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాలకు సమ ప్రాధాన్యతనిస్తూ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ జిల్లా అభివృద్ధికి పునరంకితులై అన్ని రంగాల్లో ముందుకు నడిపేందుకు తమవంతు సహకారాన్ని అందించాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో డీసీపీ నిఖితపంత్, అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్యా, జిల్లా అధికారులు. కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



వికారాబాద్‌లో అమరుల స్థూపం వద్ద నివాళులు ఆర్పిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డి





వికారాబాద్, మేడ్చల్ కలెక్టరేట్ల వద్ద పోలీసుల గౌరవ వందనం



కీసరలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

కౌంటింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన పరిశీలకులు



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మేడ్చల్ జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు కోసం హోలీమేరీ కాలేజీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఆదివారం సాధారణ పరిశీలకులు డాక్టర్ ప్రియాంకశుక్లా, రిటర్నింగ్ అధికారి గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అవసరమైన చోట్ల పలు సలహాలు, సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి కౌంటింగ్ సెంటర్లో సీసీ కెమెరా, బారికెడ్లు, కరెంటు, ఇంటర్నెట్, మౌలిక వసతులు పూర్తి అయినట్లు వెల్లడించారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు పక్కాగా జరిగేలా పర్యవేక్షణ జరుపాలని సూచించారు. నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలన్నారు. ఎలాంటి సమస్యలకు తావు లేకుండా పక్కాగా నిబంధనలు పాటిస్తూ పారదర్శకంగా నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ కౌంటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కీసర ఆర్డీవోఉపేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో భారీ వర్షం

వాగులో కొట్టుకు పోయిన కారు

- నలుగురు సురక్షితం
- పిడుగుపాటుకు జైదుపల్లిలో ఎద్దు మృతి
- అనంతగిరి రోడ్డులో విరిగిపడిన చెట్లు

వికారాబాద్/బంట్వారం/ధారూరు/పూడూరు జూన్ 2 : వికారాబాద్ జిల్లాలో ఆదివారం పలు చోట్ల వర్షం దంచికొట్టింది. బంట్వారం, మర్పల్లి, ధారూరు, మోమిన్‌పేట, నవాబుపేట వికారాబాద్ లో వర్షం భారీగా కురిసింది. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం నాగ్వారం గ్రామ సమీపంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో కారు కొట్టుకుపోయింది. అందులో ఉన్న నలుగురు సురక్షితంగా బయటపట్టారు. పరిగి నియోజకవర్గం మైసమ్మగడ్డ తండాకు చెందిన నలుగురు యువకులు విశాల్, పాండు, నరేష్, రాకేష్‌లు బంట్వారం మండలం నాగ్వారం తండాకు ఓ వేడుకకు వచ్చారు. వేడుకను ముగించుకుని బంట్వారం వెళుతుండగా భారీ వర్షం రావడం నాగ్వారం వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నా అలాగే ముందుకు వెళ్లడంతో కారు కొట్టుకుపోయింది. దీంతో నలుగురు కిందకు దిగి కారును కాపాడుకునే యత్నం చేయగా విశాల్ ,పాండు నీటిలో కొట్టుకు పోయారు. కొద్ది దూరం వెళ్లగా చెట్లను పట్టుకుని ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో విశాల్‌కు చేతికి గాయాలు కాగా ఆసుపత్రికి తరలించి కారును బయటకు తీశారు. అదే విధంగా బంట్వారం మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. బంట్వారం బస్టాండ్ వరద నీటితో నిండిపోయింది. వికారాబాద్ మండల పరిధిలోని జైదుపల్లిలో రాములుకు చెందిన ఎద్దు పిడుగు పాటుకు గురై మృతి చెందింది. అనంతగిరి ఘాట్ రోడ్డులో భారీ వర్షానికి చెట్లు విరిగిపడగా రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ధారూరు, పూడురు మండలాలతో పాటు తిర్మలాపూర్, సోమన్‌గుర్తి, రాకంచర్ల తదితర గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. దుక్కులు దున్నటానికి ఈ వర్షం ఉపకరిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జైదుపల్లిలో పిడుగుపాటుకు మృతి చెందిన ఎద్దు



బంట్వారం బస్టాండ్‌లో నిలిచిన వర్షం నీరు



అనంతగిరి ఘాట్ రోడ్డులో విరిగిపడిన చెట్టు

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జూన్ 2: జిల్లాలో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని, నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, రైతులను మోసం చేస్తే సహించేది లేదని కలెక్టర్ నారాయణరెడ్డి ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2.43 లక్షల హెక్టార్లలో పత్తి పంట సాగు అయ్యే అవకాశం ఉందని, జిల్లాలో 540 ఫర్టిలైజర్ షాపులు ఉన్నాయని, అన్ని షాపులలో స్టాక్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 5.42 లక్షల సీడ్ ప్యాకెట్‌లు అవసరముందని, 3.12 లక్షల సీడ్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని, ఏ కంపెనీ విత్తనాలపైన వాడోచ్చని సూచించారు. రైతులు విత్తనాల విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలని కోరారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించి నకిలీ విత్తనాలు విక్రయిస్తే దుకాణాల యాజమానులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు మరమ్మతులు

పరిగి, జూన్ 2: పరిగిలోని టెలిఫోన్ ఏక్స్ఛేంజి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. కోర్టు దగ్గర తారురోడ్డు దెబ్బతిని వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ సమస్యను గుర్తించిన పరిగి ఎస్ఐ సంతోష్ ఆదివారం దగ్గరుండి బాగు చేయించారు. కాంక్రిట్ మిల్లర్‌తో మాట్లాడి మెటీరియల్‌ను గుంతల్లో వేయించారు. దీంతో రోడ్డుపై గుంతల సమస్య తీరింది. ఈ సందర్భంగా స్థానికులు ఎస్ఐని అభినందించారు.

ఆస్పత్రిలో పండ్లు పంపిణీ

మేడ్చల్ టౌన్, జూన్ 2: జిల్లా బీజేపీ నాయకుడు రామన్న గారి శ్రీనివాస్‌గౌడ్ జన్మదినం సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పంపిణీ చేశారు. మండలంలోని వృద్ధాప్య, అనాథాశ్రమంలో పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు మైసరి రాజు పాల్గొన్నారు.

గ్రామ దేవతకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



శివారెడ్డిపల్లిలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ, జూన్ 2: మండలంలోని శివారెడ్డిపల్లి గ్రామంలో మైసమ్మ దేవత నూతన ఆలయం పూజా కార్యక్రమాల్లో ఆదివారం డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామదేవతను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ గిరి

యువత సన్మార్గాన్ని ఎంచుకోవాలి

పెద్దేముల్, జూన్ 2: సమాజంలో యువత సన్మార్గాన్ని ఎంచుకోవాలని పెద్దేముల్ ఎస్ఐ గిరి అన్నారు. మండల కేంద్రంలో అల్లెంకల అశోక్ కుమార్ ప్రీమియర్ లీగ్ 3 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించగా పెద్దేముల్ ఎస్ఐ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి టోర్నమెంట్లను క్రీడాకారులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు అల్లెంకల అఖిల్, ప్రశాంత్, వెంకటేష్‌గౌడ్, డీవై ప్రసాద్, ఆర్గనైజర్స్ మాదవ్‌రెడ్డి, వెంకటేష్, చిన్నా, అశోక్, చందు, సిద్దు, భాను చరణ్, ఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు.

టెన్షన్.. టెన్షన్



- ఒక వైపు ఎన్నికల ఫలితాలు
- మరోవైపు విద్యాసంవత్సరం ప్రారంభంతో ఫీజుల టెన్షన్
- సాగు పనుల్లో పెట్టుబడికి రైతుల టెన్షన్

తాండూరు, జూన్ 2: జూన్ నెల ఆరంభమైయిందంటే హడలే. రైతులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మరోవైపు పార్లమెంటు ఎన్నికల ఫలితాలతో రాజకీయ వర్గాలలో టెన్షన్ మొదలైంది. జూన్ నెలంటే ఖర్చు వద్దని పల్లెటూరి ప్రజలు అంటుంటారు. ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఎక్కువ టెన్షన్ ఎందుకంటే పిల్లలకు పుస్తకాలు, యూనీఫాం, బ్యాగ్‌లు, షూ, ఫీజులు చెల్లింపు, టై వంటి కొనుగోలుతో పాటు పలు రకాల ఖర్చులు ఉంటాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తప్పదు. ఇదిలా ఉంటే ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న ఉంది. బరిలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీ నాయకులు, ప్రజల్లో టెన్షన్ నెలకొంది. ఫలితాలు ఎవరికి అనుకూలం? ఎవరికి వ్యతిరేకగా ఉంటాయో? అన్న ఉత్కంఠ అందరిలో ఉంది. ఎక్కడ చూసినా పోలింగ్ సరళిపై చర్చ సాగుతోంది. దేశవ్యాప్తంగా విలువడే ఫలితాలపై బెట్టింగులు కడుతున్నారు. మరోవైపు రైతుల సీజన్ ప్రారంభమైంది. పొలాల్లో దుక్కులు దున్ని ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతున్నారు. ఎరువుల, విత్తనాలు కొనుగోలు, కూలీలు, ట్రాక్టర్లు, పెద్ద నాగళ్లు, వేయించడం వంటికి పెట్టుబడుల టెన్షన్, ప్రధానంగా పెట్టుబడుల కోసం అడ్తిదారులు, బ్యాంకులకు రైతులు వెళ్లి తయారు చేసుకుంటున్నారు. జూన్ నుంచి రైతులకు ఏడాది పాటు పెట్టుబడులు అవసరమవుతాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలు పిల్లల చదువుల కోసం పట్టణాలకు వచ్చి ఇంటి అద్దె తీసుకొని ఉంటున్నారు. ఇది కూడా కుటుంబాలకు భారమవుతోంది.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రశాంత్

కంప్యూటర్ ఉత్తీర్ణత సర్టిఫికెట్లు అందజేత

కొడంగల్, జూన్ 2: కొడంగల్‌లోని వీబీఆర్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో ఆదివారం విద్యార్థులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్, రిటైర్డ్ టీచర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా నిర్వాహకుడు భీమారాజ్ అందజేశారు.

కొడంగల్ రూరల్: సంగాయిపల్లిలో దివంగత శివమ్మ, అచ్చప్ప స్మారకార్థం ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో ఇంగ్లీష్, స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులు పూర్తి చేసిన వారికి సోమవారం ఉదయం 10గంటలకు ధ్రువపత్రాలు అందించనున్నట్లు నిర్వాహకులు హన్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కొడంగల్ సీఐ కె.శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములవ్వాలి



శ్రీధర్‌రావు, సుధీర్‌మోహన్‌లను సన్మానిస్తున్న గ్రామస్థులు

షాబాద్, జూన్ 2: ప్రతీ ఒక్కరు గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని చందన్‌వెల్లిలో గ్రామానికి చెందిన శ్రీధర్‌రావు, సుధీర్ మోహన్‌లు గ్రామంలో 6 సీసీ కెమెరాలు, మానిటర్లను అందజేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల స్వామి మాట్లాడుతూ సమాజ సేవ చేయడంలో ఉన్న తృప్తి మరెక్కడా ఉండదని, ప్రతీ ఒక్కరు తమ వంతుగా గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్, గ్రామస్తులు రాఘవాచారి, యాదయ్య, గోపాల్, కిష్టయ్య, వెంకటేష్, నరేష్, మహేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా



దోమ, జూన్ 2: మండలంలోని దోర్నాల్‌పల్లిలో తాగునీటి ట్యాంకు నుంచి నీరు వృథాగా పోతోంది. తాగునీటికి ప్రజలు నానా ఇబ్బందులు పడుతుంటే తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకునే వారే లేరా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండలంలోని వివిధ గ్రామాల్లో వృథాగా వెళ్తున్న నీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జనగాంలో వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణోత్సవం

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

పెద్దేముల్, జూన్ 2: జనగాంలో శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. జనగాంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల గుండా స్వామి వారికి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో హోమాలు నిర్వహించి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాన్ని జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదానం చేశారు.



బీరప్ప జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

వైభవంగా బీరప్ప జాతర

యాలాల, జూన్ 2: మండలంలోని జక్కేపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో నిర్వహించిన బీరప్ప జాతర ఉత్సవాల్లో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జక్కేపల్లి అమృతయ్య, మొగులయ్య, మైపాల్, బీమప్ప, మాజీ ఎంపీటీసీ రాజు, యాదిరెడ్డి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

తాండూరు: తాండూరు పట్టణంలో ఎస్.ఎస్.డ్యాన్స్, ఫిట్నెస్ స్టూడియో ఆధ్వర్యంలో నిర్వహిచిన నృత్య ప్రదర్శన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నృత్యకారులకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ రమేష్, స్థానిక కౌన్సిలర్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.



వర్షకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

ఆలయ అభివృద్ధికి మొదటి నెల వేతనం విరాళం

యాచారం, జూన్ 2: తనకు ఉద్యోగం వస్తే మొదటి నెల వేతనం ఆలయ అభివృద్ధికి ఇస్తానని మొక్కుకున్న యువతి కొలువు సాధించింది. ఈమేరకు తన కోరిక నెరవేరడంతో మొదటి నెల వేతనం ఆదివారం ఆలయ ఆలయ నిర్వాహకులకు అందించింది. నందివనపర్తికి చెందిన కొండూరి వర్ష కొంత కాలంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం యత్నించింది. ఉద్యోగం వస్తే మొదటి నెల వేతనం జ్ఞానసరస్వతీ మాత ఆలయ అభివృద్ధికి ఇ స్తానని మొక్కుకుంది. నెల క్రితం ఇన్‌వోలేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీలో ఉద్యోగం వచ్చింది. దాంతో ఆదివారం ఆమె కుటుంబ సభ్యులతో వచ్చి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొదటి నెల వేతనం రూ.41,735 వేతనం విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందించింది. ఆమెను ఆలయ నిర్వాహకులు అభినందించి జ్ఞాపికగా అమ్మవారి ఫొటోను అందజేశారు.

నవీన్‌రెడ్డి విజయం పట్ల బీఆర్ఎస్ నాయకుల సంబురాలు

- ఆమనగల్లు, కడ్తాలలో ర్యాలీలు
- బాణసంచా పేల్చి మిఠాయిల పంపిణీ



కొత్తూర్‌లో జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

ఆమనగల్లు/కడ్తాల్/కొత్తూర్/చౌదరిగూడ, జూన్ 2: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్ రెడ్డి విజయం పట్ల బీఆర్ఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆమనగల్లు, కడ్తాల మండల కేంద్రాలలో ఆదివారం ఫలితాలు వెలువడగానే అ పార్టీ నాయకులు పెద్దఎత్తున సంబురాలు జరుపుకున్నారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, ఎమ్మెల్సీగా ఎన్నికైన నవీన్ రెడ్డిలకు అనుకూలంగా నినాదాలు చేస్తూ ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ఆయా మండల కేంద్రాలలో బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రలోభాలకు గు రి చేసినా బీఆర్ఎస్ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు జట్టుకట్టి పార్టీ అభ్యర్థిని గెలిపించారన్నారు. డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీలు గోపాల్, లచ్చిరామ్ నాయక్, కుమార్, మంజుల చంద్రమౌళి, ప్రియ రమేశ్, సరితపంతూనాయక్, కౌన్సిలర్ రాధమ్మవెంకటయ్య, నాయకులు జోగువీరయ్య, హరిచంద్ నాయక్, సేవ్యనాయక్, వెంకటయ్య, రమేశ్, అల్లాజీ, సైదులుగౌడ్, దోనాదుల సత్యం, గన్యనాయక్, అంజి, లాయక్‌అలీ, మంగళపల్లి నర్సింహ, సయ్యద్ ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్‌లో నవీన్‌రెడ్డికి ఘనస్వాగతం

ఎమ్మెల్సీగా గెలుపొంది బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలుసుకునేందుకు హైదరాబాద్‌కు వెళ్తున్న ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డిని కొత్తూర్ వద్ద ఆ పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఆయన కొత్తూర్‌కు చేరుకోగానే శాలువాలు, పూలమాలతో సన్మానించారు. చౌరస్తాలోని జ్యోతిరావుపూలే విగ్రహానికి నవీన్‌కుమార్‌రెడ్డి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ, బి.దేవేందర్‌యాదవ్, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, యాదయ్య, జె. శ్రీను, సోమ్లానాయక్, గోపాల్‌గౌడ్, శివచారి, రవినాయక్ తదితరులు స్వాగతం పలికారు. కాగా, నవీన్‌రెడ్డి గెలుపుపట్ల చౌదరిగూడ మండలం పెద్ద ఎల్కిచర్లలో బీఆర్ఎస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. పెద్ద ఎల్కిచర్లలో టపాసులు పేల్చి, కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు.

ఎమ్మెల్సీ ఉపఎన్నికలో బీఆర్ఎస్ గెలుపుపై సంబురాలు

నవాబుపేట, జూన్ 2: మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందడం పట్ల మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్ గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తూ ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ టపాసులు పేల్చారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తలకొండపల్లి, జూన్ 2: మండల పరిధిలోని గట్టిప్పలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2009-10 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయం వద్ద నిర్వహించిన సమ్మేళనంలో బాల్యమిత్రులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిద ప్రాంతాలు, వివిద హోదాలలో ఉన్న ఏళ్ల తర్వాత కలుసుకొని పూర్వ విద్యార్థులంతా కలుసుకొని ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమ పాఠశాల నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం కు ఆటా పాటలతో ఉత్సాహంగా , ఉల్లాసంగా గడిపారు. తమ ఉన్నతికి కారణమైన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు మొకురాల అశోక్‌గౌడ్, ఖలీం, ఏదుల మహేశ్, రమేశ్, సక్రు, రవి, భాను, రమేశ్, నాగజ్యోతి, శ్రావణి,శ్రీలత, మమత, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పట్టు సడలని బీఆర్ఎస్

- మహబూబ్‌నగర్ స్థానిక ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌రెడ్డి విజయం



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నవీన్‌రెడ్డి దంపతులు

షాద్‌నగర్ అర్బన్/ఆమనగల్లు/కొత్తూర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ అభ్యర్థి నాగరకుంట నవీన్‌రెడ్డి విజయం సాధించారు. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డిపై ఆయన 111 ఓట్లతో గెలుపొందారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఈ ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో పనిచేసింది. పైగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా సైతం ఉమ్మడి మహబూబ్‌నగరే కావడంతో ఈ ఉప ఎన్నికను గెలిచేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. ఓటమితో కాంగ్రెస్‌కు ఎదురు దెబ్బ తగిలింది. గత స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన బీఆర్ఎస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్‌లో చేరి 2023 ఎన్నికల్లో కల్వకుర్తి అసెంబ్లీ స్థానం నుంచి గెలిచారు. ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికైన ఏడాదిన్నరకే రాజీనామా చేయడంతో ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక జరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న 14 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆలంపూర్, గద్వాల మినహా 12 చోట్ల కాంగ్రెస్ విజయం సాధించింది. కొడంగల్ నుంచి ఎన్నికైన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీఆర్ఎస్‌కు చెందిన చాలామంది జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. అయినా కాంగ్రెస్‌కు ఓట్ల సంఖ్య తక్కువ ఉన్నా 12మంది ఎమ్మెల్యేలు, సీఎం జిల్లా కావడంతో కాంగ్రెస్ మద్దతిచ్చే అభ్యర్థి గెలువాలన్న సంకల్పంతో ఆర్థికంగా ఉన్న మన్నె జీవన్‌రెడ్డిని బరిలో దింపారు. బీఆర్ఎస్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్‌గా పనిచేసిన నాగరకుంట నవీన్‌రెడ్డిని నిలిపింది. సీటు గెలువాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ క్యాంప్ రాజకీయాలు నిర్వహించాయి. అధికార బలం, ఎమ్మెల్యేల అండ, ఆర్థిక పరిపుష్టి ఉన్న జీవన్‌రెడ్డి విజయం ఖాయం అని కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేసేది. ఓటర్లు, ఆర్థిక బలం ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌రెడ్డి సైతం విజయంపై ధీమాగానే ఉన్నారు. ఎంతగా ప్రలోభపెట్టినా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మొదటి ప్రాధాన్య ఓటును బీఆర్ఎస్ అభ్యర్థికే వేశారు. బీజేపీ నేతలు సైతం బీఆర్ఎస్‌కే వేసినట్టు ఓటింగ్‌ను బట్టి తెలుస్తోంది. అధికారం, డబ్బు ప్రభావం కన్నా పార్టీకి కట్టుబడి ఓటు వేశారు.

వార్డు సభ్యుడి నుంచి ఎమ్మెల్సీ దాక..

ఉమ్మడి కొత్తూర్ మండలం మామిడిపల్లికి చెందిన నాగర్‌కుంట వెంకట్రామ్‌రెడ్డి, శోభారెడ్డిల చిన్న కుమారుడైన 41ఏళ్ల నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి చిన్న వయసులోనే గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడిగా గెలిచి ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అ తర్వాత ఎన్నికల్లో ఆఆయన తన తల్లి శోభారెడ్డిని సర్పంచ్‌గా గెలిపించుకున్నారు. 2014లో కాంగ్రెస్ టికెట్‌పై కొత్తూర్ జడ్పీటీసీగా గెలిచారు. అ తర్వాత టీఆర్ఎస్‌లో చేరి మహబూబ్‌నగర్ జడ్పీ వైస్‌చైర్మన్ అయ్యారు. పదవీ కాలం ముగిసిన తరువాత ఐదేళ్లు స్తబ్దుగా ఉండి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నించారు. టికెట్ రాకపోవడంతో షాద్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి అంజయ్యయాదవ్ తరఫున ప్రచారంలో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారంలో పాల్గొన్నారు. తాజాగా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. నవీన్‌రెడ్డి గెలుపుతో ఆయన స్వగ్రామం మామిడిపల్లిలో గ్రామస్తులు మిఠాయి పంచుకొని సంబరాలు చేసుకున్నారు.

నవీన్‌రెడ్డిని అభినందించిన కేసీఆర్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందిన నాగరకుంట నవీన్‌రెడ్డిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అభినందించారు. ఎన్నిక ఫలితం రాగానే నవీన్‌రెడ్డి మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లి కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. వెల్‌డన్ అంటూ కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కేటీఆర్, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, రాజేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు అభినందించారు.


వికారాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు


కొడంగల్: సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న కాంగ్రెస్ నాయకులు


వికారాబాద్: జడ్పీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి


పరిగి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


వికారాబాద్: గ్రంథాలయ ఆవరణలో జెండా ఎగురవేస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

వికారాబాద్, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా కేంద్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. జడ్పీ కార్యాలయ ఆవరణలో జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి, గ్రంథాలయ ఆవర ణలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కోటిరెడ్డి, జిల్లా కోర్టులో జిల్లా న్యాయాధికారి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి, గాంధీ పార్కులో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనారాయణ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మంజుల రమేష్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో కార్యాలయంలో వాసుచంద్ర జాతీయ జెండాలను ఎగురవేశారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద తెలంగాణ ఉద్యమకారులు నివాళులఅర్పించారు. జడ్పీచైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి అనంతగిరి శ్రీఅనంతపద్మనాభ స్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు

ధారూరు: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ధారూరు తహసీల్దార్ కార్యాలయంపై తహసీల్దార్ సాజిదాభేగం, ఎంపీడీవో కార్యాలయంపై ఎంపీడీవో నర్సింహులు పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలపై అధికారులు జాతీయ జెండాను ఎగురువేశారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మనోహరచక్రవర్తి జాతీయ జెండాను ఎగరవేశారు.

తాండూరు: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తాండూరులోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, భద్రేశ్వర్‌చౌక్ వద్ద సీపీఐ జిల్లా పార్టీ కార్యదర్శి విజయలక్ష్మి, పండిత్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఇందిరాచౌక్‌లో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి, మాజీ వైస్‌చైర్‌పర్సన్ రత్నమాల, కౌన్సిలర్లు నీరజ బాల్‌రెడ్డి, ప్రభాకర్ గౌడ్, మమత, బోయ రవిరాజు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: మండలంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ అనితాగౌడ్, ఎస్టీవో కార్యాలయం వద్ద ఎస్టీవో శ్రీధర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఏడీ రుద్రమూర్తి, పశు సంవర్ధక శాఖ కార్యాలయం వద్ద ఏడీ ప్రమురాజ్, ఎంఈవో కార్యాలయం వద్ద ఎంఈవో వెంకటయ్య, ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీడీపీవోలు శ్రీలక్ష్మి, తాండూరు మండల ఎల్మకన్నె సహకార సంఘం కార్యాలయం వద్ద పీఏసీఎస్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వప్రసాద్, అధికారులు డి.గోపీనాథ్, సంతోష్‌కుమార్, రజిత పాల్గొన్నారు.

యాలాల: మండల కేంద్రంలో ఆదివారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ మునీరోద్దిన్, పోలీస్‌స్టేషన్ ముందు ఎస్ఐ శంకర్, ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, ఎంఈవో కార్యాలయం ముందు ఎంఈవో సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, పీఏసీఎస్ కార్యాలయం ఎదుట చైర్మన్ సురేందర్‌రెడ్డి, బీజేపీ కార్యాలయం ఎదుట బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు జంగం యాదగిరి, పీహెచ్‌సీ ఎదుట డాక్టర్ అనూష, ఐకేపీ కార్యాలయం వద్ద మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నర్సిలక్ష్మి జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పుష్పలీల, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బషీరాబాద్: బషీరాబాద్‌లోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించి తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయ శంకర్ చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్, రెవెన్యూ కార్యాలయం ఎదుట తహసీల్దార్ వై.వెంకటస్వామి, పోలీస్‌స్టేషన్ భవనం పైన ఎస్ఐ రమేష్, నవాంద్గి పీఏసీఎస్ కార్యాలయం ఎదుట చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడి, పీహెచ్‌సీ ఎదుట డాక్టర్ శ్రీకాంత్, పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్.వెంకటేష్, ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీలు, పాఠశాలల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవులు, అధికారులు వెంకటయ్య, రాకేష్, వెంకటేశం, శేర్‌ఖాన్, బందెయ్య, రాజశేకర్, ఫారుఖ్, నరేష్, తుకారాం పాల్గొన్నారు.

పెద్దేముల్: తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులు జాతీయ జెండా ఆవిష్కరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయా పార్టీల నాయకులు, యువకులు జాతీయ జెండాను ఎగురవేసి తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు.

కొడంగల్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొడంగల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏడీఏ శంకర్‌రాథోడ్, పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ భరత్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్, టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యూసుఫ్, పీఏసీఎస్ కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్ కటకం శివకుమార్ గుప్త జాతీయ జెండాలను ఆవిష్కరించారు. కొడంగల్ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి సిబ్బందికి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, వైస్‌చైర్‌పర్సన్ ఉషారాణి, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యుడు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జి.నర్సింహులుగౌడ్, మెట్లకుంట పీఏసీఎస్ వద్ద చైర్మన్ జయకృష్ణ, తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రవి, ప్రభుత్వాసుపత్రిలో వైద్యాధికారి హేమంత్ జాతీయజెండాలను ఎగరవేశారు.

దౌల్తాబాద్: దౌల్తాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ విజయ్‌కుమార్ జాతీయ జెండాను ఎగరవేశారు. పీఏసీఎస్ కార్యాలయం ఎదుట అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కోట్ల మహిపాల్, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, బోడివెంకట్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, కూర వెంకట్రాములు, ఎంపీటీసీ మంజుల దస్తప్ప, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

దోమ: మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎంపీపీ అనసూయ జాతీయ జెండాను ఎగరవేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ పురుషోత్తం జాతీయ జెండాను ఎగరవేశారు.

పరిగి: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి, మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఎం.అశోక్, పరిగి రెవెన్యూ కార్యాలయంపై తహసీల్దార్ ఆనంద్‌రావు, మండల పరిషత్ కార్యాలయంలో జడ్పీటీసీ బి.హరిప్రియ, ఎంపీపీ అరవింద్‌రావు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎన్.శ్రీనివాస్, జైలులో జైలు సూపరింటెండెంట్ రాజ్ కుమార్, అమర వీరుల చౌరస్తాలో జేఏసీ జిల్లా కన్వీనర్ ఎం.నాగేశ్వర్, విద్యుత్ కార్యాలయంపై ఏడీఈ రామ్మూర్తి జాతీయ జెండాలను ఎగురవేశారు.

పూడూరు: మండలంలోని వివిధ పంచాయతీల కార్యాలయం వద్ద ఆయాశాఖల అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు.

కులకచర్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ముందు అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాలను ఎగరవేశారు. ఏఎస్ఐ సత్యశీలారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ఖాజ జిల్లా స్థాయి ఉత్తమ పోలీసు సేవా పథకం అవార్డులు అందుకున్నారు జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి అవార్డులు, ప్రశాంస పత్రాలు అందజేశారు. ఎస్ఐ అన్వేష్‌రెడ్డి వారిని అభినందించారు.


మేడ్చల్ టౌన్: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు


కీసర రూరల్: నాగారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి


ఘట్‌కేసర్ రూరల్: ఎంపీడీవో కార్యాలయంపై జాతీయజెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీవో గీతారెడ్డి


ఘట్‌కేసర్: జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని తదితరులు


ఘట్‌కేసర్: పోచారం మున్సిపల్ కార్యాలయం వద్ద జెండావందనం చేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి


మూడుచింతలపల్లి: జాతీయ జెండాను ఎగుర వేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ నాగజ్యోతి

మేడ్చల్ జిల్లాలో..

మేడ్చల్ టౌన్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మేడ్చల్ జిల్లాలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వేడుకలను ప్రారంభించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి, కమిషనర్ రాములు, కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, సాయిపేట శ్రీనివాస్ యాదవ్‌లు కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు వేముల శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, నాగభూషణం, వర్ధారెడ్డి, రాఘవేందర్‌గౌడ్, స్వామి యాదవ్ పాల్గొన్నారు.

కీసర: ఎంపీడీవో కార్యాలయంపై ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ జాతీయజెండాను ఆవిష్కరించారు. ప్రతాప్‌సింగారంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, ఘట్‌కేసర్‌లో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీడీవో గీతారెడ్డి, వైస్ ఎంపీపీ కర్రె జంగమ్మ, డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డి, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, రవి, నీరుడి రామారావ పాల్గొన్నారు.

కీసర రూరల్: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాగారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ చంద్రారెడ్డి, దమ్మాయిగూడలో చైర్‌పర్సన్ వసుపతి ప్రణీతలు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్ర మంలో వైస్‌చైర్మన్లు మల్లేష్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, కమిషనర్లు రాజేందర్‌కుమార్, రాజమల్లయ్య, మేనేజర్లు చంద్రశేఖర్, వెంకటేశం పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, పోచారం మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, ఘట్‌కేసర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్లు సాబేర్‌అలీ, వేమన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రెడ్డియానాయక్, పోచారం నాయకులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘట్‌కేసర్, కీసర మండలాల్లో ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లు, పంచాయతీ కార్యాలయాలను తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా సుందరంగా ముస్తాబు చేశారు. ఘట్‌కేసర్ ఎంపీడీవో కార్యాలయంపై ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, తహసీల్దార్ కార్యాలయంపై తహసీల్దారు డీఎస్ రజిని, పోలీస్‌స్టేషన్‌పై సీఐ ఎస్.సైదులు, పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్‌పై సీఐ రాజువర్మ, ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాలపై పంచాయతీ కార్యదర్శులు జాతీయజెండాను ఆవిష్కరించారు.

మూడుచింతలపల్లి: మండల కేంద్రంలోని వివిధ గ్రామాల్లో తెలంగాణ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, డీటీ నాగజ్యోతి, ఆర్ఐలు నరేశ్, రాఘవ, వివిధశాఖల అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, మాజీ సర్పంచులు జామురవి, ఎంపీటీసీ నాగరాజు, వార్డు సభ్యులు, నాయకులు లక్ష్మారెడ్డి, నర్సింహులు, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శామీర్‌పేట: తూంకుంట మున్సిపల్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సాలవాలను, వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తూంకుంట మున్సిపల్‌లో చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ పన్నాల వాణీవీరారెడ్డి, మండల కార్యాలయం వద్ద ఎంపీపీ ఎల్లుబాయి, జడ్పీటీసీ అనిత, శామీర్‌పేట, తుర్కపల్లి జీనమ్‌వ్యాలీ పోలీస్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనాథ్, యాదయ్యగౌడ్, ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యుడు శ్రీకాంత్, శామీర్‌పేట విద్యుత్ ఉపకేంద్రం వద్ద ఏడీఈ రమణారెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు. అదేవిధంగా ఏఈ రమేశ్, అలియాబాద్ విద్యుత్ కేంద్రం వద్ద ఏఈ శ్రీనివాస్‌గౌడ్, శామీర్‌పేట రైతు సేవా సహకార సంఘం చైర్మన్ మధుకర్‌రెడ్డి, బొమ్మరాసిపేటలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ జాతీయ జెండాలను ఎగరవేసి వేడుకలను జరుపుకున్నారు. శామీర్‌పేట ఇందిరా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నక్కప్రభాకర్‌గౌడ్‌లు జాతీయజెండాను ఎగురవేశారు. బొమ్మరాసిపేట వద్ద తెలంగాణతల్లి విగ్రహానికి ఎంపీపీ ఎల్లుబాయి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి తెలంగాణ వేడుకలను నిర్వహించారు.


యాలాల: మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండా వందనం చేస్తున్న ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా


శామీర్‌పేట: బొమ్మరాసిపేట తెలంగాణతల్లి విగ్రహం వద్ద వేడుకల్లో ఎంపీపీ, జడ్పీటీసీ


తాండూరు రూరల్: ఎంపీడీవో కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ అనితాగౌడ్


బషీరాబాద్: రెవెన్యూ కార్యాలయం ఎదుట ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న తహసీల్దార్


కీసర రూరల్: దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండా ఎగురవేస్తున్న చైర్‌పర్సన్ ప్రణీత


కులకచర్ల: ఎంపీడీవో కార్యాలయం వద్ద తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు


తాండూరు: ఇందిరాచౌక్‌లో జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు


పూడూరు: ఎంపీడీవో కార్యాలయం వద్ద జెండా వందనం చేస్తున్న అధికారులు


బొంరాస్‌పేట్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు


దోమ: జెండా వందనం చేస్తున్న ఎంపీపీ అనసూయ, అధికారులు, ప్రజాప్రతినిధులు


మోమిన్‌పేట్: తహసీల్దార్ కార్యాలయంలో జెండాను ఎగరవేస్తున్న తహసీల్దార్


పెద్దేముల్: మంబాపూర్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలో పాల్గొన్న నాయకులు


కొడంగల్ రూరల్: జెండాను ఎగరవేస్తున్న చైర్మన్


దౌల్తాబాద్: ఎంపీడీవో కార్యాలయం ఎదుట జెండాను ఎగరవేస్తున్న ఎంపీపీ విజయ్‌కుమార్

మండి బిర్యానీ తిని ఆరుగురికి అస్వస్థత

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 2: మండి బిర్యానీ తిని ఐదుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ఎస్.సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నర్సాపూర్ గ్రామానికి చెందిన మద్యటి ఉషారాణి మరో ఎనిమిది మంది బంధువులతో కలిసి గతనెల 31వ తేదీన యాదాద్రి-భువనగిరి జిల్లా, భువనగిరిలోని స్వర్ణగిరి ఆలయానికి వెళ్లారు. దర్శనం పూర్తయ్యాక రాత్రి 10గంటలకు కారులో ఇంటికి బయల్దేరారు. ఘట్‌కేసర్‌లో రాత్రి భోజనం కోసం అరేబియన్ మండిలో బిర్యానీ తినడానికి వచ్చారు. తొమ్మిది మందిలో ఉషారాణి, చందు, మహేష్, రేణుక, అశోక్, మౌనికలు మండి బిర్యానీ తినగా మిగతా ముగ్గురు తినలేదు. అనంతరం నర్సాపూర్‌లోని ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికి మండి బిర్యానీ తిన్న ఆరుగురికి వాంతులు, విరేచనాలు వచ్చి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పగా కల్తీ ఆహారం వల్లే అస్వస్థతకు గురైనట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో ఆదివారం ఉషారాణి తండ్రి కోలోజు నర్సింహాచారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కల్తీ ఆహారం విక్రయిస్తున్న అరేబియన్ మండి యజమానిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యావాపూర్ ఘటనలో మూడుకు చేరిన మృతులు

తూప్రాన్, జూన్ 2: యావాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం అనంతగిరిపల్లికి చెందిన కర్రె జోయల్(సాయి) వివాహం 20న చేసేందుకు నిర్ణయించారు. జోయల్ పెళ్లి ఏర్పాట్లలో అతడి అన్న కర్రె నర్సింహులు(44) బిజీగా ఉన్నాడు. ఈ క్రమంలో మేడ్చల్ జిల్లా కండ్లకోయకు చెందిన పెద్దనాన్న తొంటోళ్ల పోచయ్య (58)తో కలిసి నర్సింహులు బైక్‌పై తూప్రాన్‌కు వచ్చి తిరుగు ప్రయాణం కాగా యావాపూర్ శివారులోకి చేరుకోగానే ఎదురుగా వచ్చిన అశోక్ లీలాండ్ వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న నలుగురు ఎగిరి దూరంగా పడి గాయాలపాలై చికిత్స పొందుతూ ఆరోజే కర్రె నర్సింహులు, మోహన్‌రాజ్ మృతిచెందాడు. తాజాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కండ్లకోయకు చెందిన తొంటోళ్ల పోచయ్య(58) శనివారం రాత్రి మృతిచెందాడు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

తాండూరు రూరల్, జూన్ 2: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కరన్‌కోట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బసవేశ్వరనగర్‌కు చెందిన వడ్డె రాజు(30) అదే కాలనీలోని మారుతి పాలిషింగ్ యూనిట్‌లో కూలి పనిచేసేవాడు. మద్యానికి బానిసైన రాజు భార్యతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన రాజు శనివారం రాత్రి తన గదిలో ఇనుపరాడ్డుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాల్య వివాహం నిలిపివేత

ధారూరు, జూన్ 2: ధారూరులోని ఓ చర్చిలో బాల్య వివాహం జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా అడ్డుకుని వివాహన్ని నిలిపివేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(15)కు అదే గ్రామానికి చెందిన బంధువుల అబ్బాయి బెంజిమిన్(22)తో వివాహం జరిపించేందుకు నిశ్చయించారు. ఇందులో భాగంగా ఆదివారం ధారూరులోని చర్చి వద్దకు వచ్చిన పెళ్లివారు పెళ్లి ఏర్పాట్లు చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు చైల్డ్‌లైన్ సంస్థ వారితో కలిసి చర్చివద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. బాలికను చైల్డ్‌లైన్ వారికి అప్పగించినట్లు ఎస్ఐ చెప్పారు.

మంటలు చెలరేగి కారు దగ్ధం

మోమిన్‌పేట్, జూన్ 2: మండలంలోని మేకవనంపల్లి-సదాశివపేటకు వెళ్లేమార్గంలో ఆదివారం ఓ కారు పూర్తిగా దగ్ధమైంది. ఉదయం సదాశివపేట నుంచి మోమిన్‌పేట్‌కు వచ్చీపోయే వాహనదారులు, ప్రయాణికులు తీవ్రఇబ్బందులకు గురయ్యారు. ఆ దగ్ధమైన కారును అక్కడి నుంచి తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. ఆ కారు ఎక్కడిది, ఎవరిదనే విషయాలు తెలియలేదని గ్రామస్థులు తెలిపారు.


నడిరోడ్డులో దగ్ధమైన కారు